తిరునగరిలో మద్యం అక్రమాలు అరికట్టండి



ఎక్సైజ్‌శాఖ అధికారులకు ఫిర్యాదు చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

తిరుపతి మంగళం : పవిత్ర పుణ్యక్షేత్రమైన తిరునగరిలో మద్యం అక్రమాలను అరికట్టాలని వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షులు ఉదయ్‌వంశీ కోరారు. తిరుపతి నగరంలో మద్యం అక్రమ వ్యాపారాలపై మంగళవారం ఎక్సైజ్‌శాఖ అధికారులకు వైఎస్సార్‌సీపీ నాయకులు ఫిర్యాదు చేశారు. అనంతరం ఉదయ్‌వంశీ మాట్లాడుతూ శ్రీవారి దర్శనార్థం ప్రపంచ నలుమూలల నుంచి ప్రతి రోజూ లక్షలాది మంది భక్తులు తిరుపతి నగరానికి విచ్చేస్తుంటారని తెలిపారు. అయితే తిరుపతి నగరంలో భక్తులు దిగగానే వేంకటేశ్వరస్వామి నామస్మరణల కన్నా తెల్లవారుజాము నుంచే మద్యం షాపులు దర్శనమిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ నిబంధనల మేరకు ఉదయం 10గంటల నుంచి రాత్రి 10గంటల వరకు మద్యం విక్రయాలు జరిగేలా చర్యలు తీసుకోవాలని ఎక్సైజ్‌శాఖ అధికారులను కోరారు. నిబంధనలు పాటించని మద్యం షాపులపై తగిన చర్యలు తీసుకుంటామని ఎక్సైజ్ అధికారులు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా సోషల్ మీడియా విభాగం ఉపాధ్యక్షులు ఇరగం అనిల్ రెడ్డి, ఉమ్మడి చిత్తూరు జిల్లా అధికార ప్రతినిధి పసుపులేటి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

మహిళ మెడలో
గొలుసు అపహరణ

పాకాల : పిల్లలతో కలసి ద్విచక్ర వాహనంలో వెళ్తున్న ఓ మహిళ మెడలో నుంచి బంగారు గొలుసును గుర్తు తెలియని దుండగులు లాక్కెళ్లిన ఘటన సోమవారం స్థానిక సత్యం ఆలయం వద్ద చోటుచేసుకుంది. వివరాలు.. రాత్రి 9.30 గంటల సమయంలో భారతంమిట్ట 5వ క్రాస్‌కు చెందిన మౌనిక తన ఇద్దరు పిల్లలతో కలసి స్కూటీలో వెళ్తుండగా చైన్‌స్నాచింగ్ జరిగింది. సుమారు 30 గ్రాముల గొలుసును బైక్ మీద వచ్చిన దుండగులు లాక్కెళ్లినట్లు బాధితురాలు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైతులకు పెట్టుబడి సాయం చెల్లించాలి



డీటీకి వినతిపత్రం సమర్పిస్తున్న రైతు సంఘం నాయకులు

పాకాల : ఎన్నికల సమయంలో చెప్పినట్లు రైతులకు ఖరీఫ్ సాగు సమయంలో పెట్టుబడి సాయం కింద ఇస్తామన్న రూ.20 వేలు వెంటనే చెల్లించాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి హేమలత డిమాండ్ చేశారు. మంగళవారం దేశవ్యాప్తంగా రైతు సంఘం ఆధ్వర్యంలో జరుగుతున్న సమ్మెలో భాగంగా స్థానిక డీటీకి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడిన ఏడాది కావొస్తున్నా.. ఇప్పటి వరకు రైతు లకు పెట్టుబడి సాయం అందించకపోవడం దారుణమన్నారు. ఈ రోజుల్లో వ్యవసాయానికి పెట్టుబ డులు విపరీతంగా పెరిగిపోయాయని, పురుగు మందులు, ఎరువులు, విత్తనాలు కొనుగోలు చేయ లేని దుస్థితిలో రైతులు ఉన్నారన్నారు. పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు లేక రైతులు అల్లాడుతున్నారని, ప్రభుత్వం స్పందించి పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు సుగుణ, ఆదికేశవులురెడ్డి, రైతులు పాల్గొన్నారు.

ఎర్రచందనం పట్టివేత



పట్టుబడిన వాహనాలు, ఎర్రచందనం దుంగలతో అటవీశాఖ సిబ్బంది

భాకరాపేట : ఎర్రావారిపాళెం మండలం ఓఎస్ గొల్లపల్లె రహదారి వద్ద మంగళవారం వేకువజామున కారులో తరలిస్తున్న 8 ఎర్రచందనం దుంగలను అటవీశాఖ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. కారు డ్రైవర్, వెనుక ద్విచక్రవాహనంలో వస్తున్న మరో ఇద్దరు నిందితులు పరారయ్యారు. కారులో పట్టుబడిన ఎర్రచందనం విలువ సుమారు రూ.20 లక్షలు ఉంటుందని అటవీశాఖ అధికారి వెంకటరమణ తెలిపారు. ఫారెస్ట్ సిబ్బంది మునిస్వామినాయక్, లక్ష్మీప్రసాద్, రాజేష్‌కుమార్, శంకర్, ప్రభుతేజ పాల్గొన్నారు.

త్వరితగతిన అభివృద్ధి పనులు పూర్తి చేయండి



అధికారులకు సూచనలిస్తున్న కమిషనర్

తిరుపతి తుడా: నగరంలో జరుగుతున్న అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ మౌర్య అధికారులను ఆదేశించారు. నగర పాలక సంస్థ పరిధిలోని జీవకోన, రాజీవ్ గాంధీ కాలనీ తదితర ప్రాంతాల్లో అభివృద్ధి పనులతో పాటు పారిశుద్ధ్య పనులను ఇంజినీరింగ్, హెల్త్, టౌన్ ప్లానింగ్, రెవెన్యూ అధికారులతో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జీవకోన వంటి ప్రాంతాల్లో ప్రజలకు అవసరమైన అన్ని అభివృద్ధి పనులు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. అలాగే అక్కడ జరుగుతున్న అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలని చెప్పారు. ఇంటింటి చెత్త సేకరణ పక్కగా చేయాలని, ఎక్కడా చెత్తకుప్పలు లేకుండా పారిశుద్ధ్య పనులు చేపట్టాలని సూచించారు. కమిషనర్ వెంట సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాం సుందర్, మున్సిపల్ ఇంజినీర్ గోమతి, తుడా ఈఈ రవీంద్ర, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువఅన్వేష్, రెవెన్యూ అధికారి రవి, తదితరులు ఉన్నారు.

శ్రీవారి దర్శనానికి 15 గంటలు

తిరుమల: తిరుమలలో సర్వదర్శనానికి 15 గంటల సమయం పడుతోంది. అన్ని కంపార్ట్‌మెంట్లు నిండి క్యూలైన్ ఏటీజీహెచ్ వరకు చేరుకుంది. సోమవారం అర్ధరాత్రి వరకు 79,003 మంది స్వామివారిని దర్శించుకోగా 33,140 మంది భక్తులు తలనీలాలు సమర్పి ంచారు. హుండీలో రూ.3.52 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతుండగా టికెట్లు లేనివారికి 15 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 3 గంటల్లో దర్శనం లభిస్తోంది.

మహాభారత ఉత్సవాలకు ఏర్పాట్లు



ఉత్సవాల సందర్భంగా చేస్తున్న ప్రత్యేక ఏర్పాట్లు

చంద్రగిరి: మండల పరిధిలోని నరసింగాపురంలో మహాభారత ఉత్సవాల నిర్వహణకు ఏర్పాట్లను పూర్తి చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. మంగళవారం వారు మాట్లాడుతూ 18 రోజుల పాటు ఉత్సవాలు జరుగుతాయన్నారు. ఈ సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పక్కాగా ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. బుధవారం ఉదయం శ్రీద్రౌపతీ సమేత ధర్మరాజుల వారి ఉత్సవ విగ్రహాలకు ప్రత్యేక పూజలు, ఉదయం 9 గంటలకు గ్రామంలో ఉత్సవ విగ్రహాల ఊరేగింపు ఉంటుందన్నారు. అనంతరం గురువారం శ్రీకృష్ణలీలలతో ఉత్సవాలు ప్రారంభం కానున్నట్లు తెలిపారు. మండలంలోనే ఎంతో ప్రతిష్టాత్మకంగా ఈ ఉత్సవాలను నిర్వహిస్తున్నామని, ఉత్సవ కమిటీ అందుకోసం అహర్నిశలు పని చేస్తున్నట్లు చెప్పారు. పగలు, రాత్రి జరిగే హరికథ, నాటక ప్రదర్శనలను తిలకించేందుకు వచ్చే భక్తుల సౌకర్యార్థం అన్ని ఏర్పాట్లను పూర్తి చేశామన్నారు.

ప్రకాశం పంతులుకు నివాళి



నివాళులర్పిస్తున్న ఎస్వీయూ అధికారులు, ఉద్యోగులు

తిరుపతి సిటీ: స్వాతంత్ర్య సమరయోధుడు, ఆంధ్ర రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి టంగుటూరి ప్రకాశం పంతులు 68వ వర్ధంతి ఎస్వీయూలో ఘనంగా నిర్వహించారు. విశ్వవిద్యాలయ ప్రాంగణంలోని ఆయన విగ్రహానికి వీసీ, రిజిస్ట్రార్, ఉద్యోగులు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వీసీ మాట్లాడుతూ టంగుటూరి ప్రకాశం పంతులు ఒక మహోన్నత వ్యక్తిత్వం గల వారని, దేశభక్తి, నైతికత, ఆంధ్రప్రదేశ్ చరిత్రపై చెరగని ముద్ర వేశాయన్నారు. 1954లో శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం ఉద్భవించిందని, రాయలసీమ ప్రాంతంలో ప్రముఖ ఉన్నత విద్యాసంస్థను ఏర్పాటు చేయడంలో ఆయన దూరదృష్టి మరువలేనిదన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ భూపతినాయుడు, అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

మెకానిక్‌కు ఆర్థికసాయం



ఆర్థిక సాయం అందిస్తున్న అసోసియేషన్ నేతలు

తిరుపతి కల్చరల్: ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురై వైద్య చికిత్స పొందుతున్న మెకానిక్ భాస్కర్‌నాయుడుకు తిరుపతి టూ వీలర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఆవుల మునిరెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం రూ.10 వేలు ఆర్థిక సాయం అందించారు. లక్ష్మీపురం సర్కిల్లో మెకానిక్ షాపు నడుపుకుంటూ కుటుంబాన్ని పోషించుకునే భాస్కర్ నాయుడు ప్రమాదానికి గురై కాలు విరిగి ఆస్పత్రి పాలయ్యారు. కార్యక్రమంలో అసోసియేషన్ ఉపాధ్యక్షుడు ప్రభు, కార్యదర్శి జలంధర్, సహాయ కార్యదర్శి గురు ఆచారి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు లక్ష్మణరావు, కోశాధికారి బాబు, కమిటీ ఇన్‌చార్జ్ కేశవ పాల్గొన్నారు.

ఐసెట్‌లో కౌటిల్య విద్యార్థికి రెండోర్యాంకు



సందీప్‌రెడ్డిని అభినందిస్తున్న కౌటిల్య డైరెక్టర్ శ్రీధర్

తిరుపతి ఎడ్యుకేషన్ : ఐసెట్ ఫలితాల్లో తిరుపతి ఎమ్మార్‌పల్లి సర్కిల్‌లోని కౌటిల్య విద్యాసంస్థ విద్యార్థి ద్వారకచర్ల సందీప్‌రెడ్డి రాష్ట్రస్థాయిలో రెండో ర్యాంకు సాధించి ప్రతిభ చాటాడు. కౌటిల్య డైరెక్టర్ శ్రీధర్ మాట్లాడుతూ ఈ నెల 7న రాష్ట్రస్థాయిలో నిర్వహించిన ఐసెట్‌కు 34,131మంది విద్యార్థులు హాజరైనట్లు తెలిపారు. ఈ ఫలితాల్లో తమ విద్యార్థి రాష్ట్ర స్థాయి రెండో ర్యాంకుతో పాటు పలువురు విద్యార్థులు ఉత్తమ ర్యాంకులు సాధించడం గర్వంగా ఉందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థి సందీప్‌రెడ్డిని అభినందించారు.

కొత్త లేఅవుట్ల ఏర్పాటుకు స్థలాల పరిశీలన



అధికారులతో మాట్లాడుతున్న తుడా ఉపాధ్యక్షురాలు

తిరుపతి తుడా: తిరుపతి పట్టణాభివృద్ధి సంస్థ పరిధిలోని సూళ్లూరుపేట, నాయుడుపేట, వెంకటగిరి ప్రాంతాల్లో కొత్తగా లేఅవుట్లు వేసేందుకు స్థలాలను పరిశీలన చేస్తున్నట్లు తుడా ఉపాధ్యక్షురాలు మౌర్య అన్నారు. ఆమె మంగళవారం తుడా అధికారులతో కలసి నాయుడుపేట, సూళ్లూరుపేట, వెంకటగిరి ప్రాంతాల్లో లేఅవుట్లు వేయడానికి అనువైన ప్రాంతాలను పరిశీలించారు. రాష్ట్రప్రభుత్వ ఆదేశానుసారం తుడా పరిధిలో ప్రజలకు ఉపయోగకరంగా ఉండే భూములను గుర్తిస్తున్నామని అన్నారు. భూములు కొనుగోలు చేసి అందులో లేఅవుట్లు వేసి అభివృద్ధి చేస్తామన్నారు. సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ ఉపాధ్యక్షులను కలిసి సూళ్లూరుపేటలోని పార్క్, రోడ్లను అభివృద్ధి చేయాలని కోరారు. తుడా పరిధిలో బడ్జెట్ పరిశీలించి అన్ని పనులు చేయిస్తామని చెప్పారు. ఆమె వెంట తుడా సూపరింటెండెంట్ ఇంజినీర్ కృష్ణారెడ్డి, ఈఈ రవీంద్ర, సీపీఓ దేవికుమారి, ఎల్‌పీఓ సుజన ఉన్నారు.

వైభవంగా గంగ జాతర



పట్టువస్త్రాలు తీసుకొస్తున్న డీసీఎంఎస్ మాజీ చైర్మన్లు సహదేవరెడ్డి, నాగలక్ష్మి

భాకరాపేట : చిన్నగొట్టిగల్లు మండలంలోని చినిగేపల్లె గ్రామంలో వెలసిన తిరుపతి గంగమ్మ జాతరను గ్రామస్తులు అత్యంత భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. గంగమ్మకు మంగళవారం డీసీఎంఎస్ మాజీ చైర్మన్లు సహదేవరెడ్డి, నాగలక్ష్మి పట్టువస్త్రాలు సమర్పించారు. అమ్మవారికి ఉదయం శాంతి హోమాలు, క్రతువు నిర్వహించారు. అనంతరం చినిగేపల్లెలో అమ్మవారిని ఊరేగించారు. పలువురు గంగమ్మ వేషధారణల్లో మొక్కులు తీర్చుకున్నారు. ఈ ర్యక్రమంలో స్థానిక సర్పంచ్ సింహాల విమల, మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు సింహాల మోహన, గ్రామస్తులు, ధర్మకర్తలు పాల్గొన్నారు.

శ్రీవారి పోటులో సీబీఐ అధికారుల పరిశీలన

తిరుమల : టీటీడీలో కల్తీ నెయ్యి ఆరోపణలపై విచారిస్తున్న సీబీఐ దర్యాప్తు ముమ్మరం చేసింది. మంగళవారం ఉదయం దర్యాప్తు బృందం శ్రీవారిని దర్శించుకుంది. అనంతరం ఆలయంలోని పోటును, బూందీ తయారీ పోటును, నెయ్యి వినియోగాన్ని పరిశీలించింది. పోటులో లడ్డూల తయారీ, సరఫరా అంశాలపై ఆరాతీసింది.

జేసీబీతో బంకును తొలగిస్తున్న దృశ్యం



పేదల దుకాణాలను తొలగించేందుకు భారీగా మోహరించిన టౌన్ ప్లానింగ్ అధికారులు, సెక్రటరీలు, పోలీసులు



మా బతుకులను వీధిన పడేస్తారా ?

మంగళవారం ఉదయం సరిగ్గా 6 గంటలు సమయం అప్పుడే బొంతాలమ్మ గుడి పక్కన ఫుట్‌పాత్‌పై వ్యాపారం చేసుకునే పేదలు తమ వ్యాపార సామగ్రిని సర్దుకుంటున్నారు. ఇంతలోనే మూడు జేసీబీలు, పెద్దసంఖ్యలో పోలీసులు, టౌన్‌ప్లానింగ్ అధికారులు అక్కడకు చేరుకున్నారు. చిరువ్యాపారులకు ఏమి జరుగుతోందో తెలియని అయోమయ పరిస్థితి నెలకొంది. ఇంతలో అధికారులు వచ్చి జేసీబీలతో వచ్చి.. నోటీసులు ఇవ్వకుండా సామగ్రిని సర్దుకునే సమయం ఇవ్వకుండా కూల్చేశారు. అయ్యా.. కొద్దిసేపు సమయమివ్వండి.. సామగ్రి సర్దుకుంటాం.. అని వేడుకున్నా కనికరించలేదు. సుమారు 15 షాపులను 10 నిమిషాల్లో నేలమట్టం చేశారు. వేల రూపాయలు విలువ చేసే పండ్లు, కూరగాయలు, పూజసామగ్రి, ఐరన్ బంకులు, గుడిసెలను కూల్చేశారు. దీంతో బాధితులు రోడ్లపై బైఠాయించి తలపట్టుకుని బోరున విలపించారు.

- బొంతాలమ్మ గుడి వద్ద చిరు వ్యాపారులపై జులుం
- జేసీబీలతో వ్యాపార సామగ్రి, గుడిసెలు నేలమట్టం
- కాళ్లావేళ్లా పడినా కనికరించని అధికారులు
- ప్రత్యామ్నాయం చూపకుండానే పడగొట్టేసిన వైనం
- వందమందికి పైగా పోలీసులతో వచ్చి కూల్చివేతలు



పందిరి కూల్చేయడంతో వీధిన పడిన పేదలు

తిరుపతి తుడా: జిల్లాలో కూటమి ప్రభుత్వం రావణకాష్టం కొనసాగిస్తూనే ఉంది. రాజకీయ కక్ష సాధింపులు, బడుగు, బలహీన వర్గాలపై దాడులు, ప్రశ్నించిన వారిని బెదిరించడం, కేసులు పెట్టడం నిత్యకృత్యమైంది. తాజాగా తిరుపతి కార్పొరేషన్ పరిధిలో పొట్టకూటి కోసం ఏళ్ల తరబడి రోడ్లపై చిరువ్యాపారాలు చేసుకుంటున్న వీధి విక్రయదారులపై జులుం విధిల్చారు.

అడ్డుకోవడానికి వచ్చిన వారిని అరెస్ట్

రాజకీయ నాయకులు, గుత్తేదారులు రోడ్లను, చెరువులను, ఏకంగా ప్రభుత్వ స్థలాలను కబ్జాలు చేసి మేడల మీద మేడలు కడుతున్నా టౌన్‌ప్లానింగ్ అధికారులు అడ్డుకోరని.. కనీసం అడ్డుకున్న పాపాన పోలేదని ఏఐటీయూసీ నాయకులు ఆరోపించారు. రోడ్డుపై చిరువ్యాపారం చేసుకుంటున్న పేదలపై కూటమి నాయకుల ప్రోత్సాహంతో నగరపాలక సంస్థ అధికారులు ప్రతాపం చూపడం అన్యాయం. వారికి సంబంధించిన వ్యాపార సామగ్రిని నేలమట్టం చేయడం దారుణమంటూ కూల్చివేతలను అడ్డుకునే ప్రయత్నం చేశారు. దీంతో పోలీసులు వారిని అరెస్ట్ చేశారు. అయితే తమ తోపుడు బండిని కూల్చవద్దంటూ విలపిస్తూ అడ్డుపడిన ఓ మహిళను సైతం మహిళా పోలీసులు అరెస్ట్ చేశారు.

ప్రత్యామ్నాయం చూపకుండానే కూల్చివేత

టౌన్‌ప్లానింగ్ అధికారులు వీధి వ్యాపారులకు కనీసం ముందస్తు సమాచారం ఇవ్వలేదు. పైగా ప్రత్యామ్నాయం కూడా చూపకుండానే షాపులను తొలగించారు. దీంతో వ్యాపారులు బోరున విలపించారు. కనీసం ప్రత్యామ్నాయం అయినా చూపించి షాపులు కూలగొట్టండయ్యా అని వేడుకున్నారు. కానీ అధికారులు వారి బాధలేవీ వినకుండా వారి పని కానిచ్చేశారు.

స్థానికుల ఆవేదన

కార్పొరేషన్ సిబ్బంది చేపట్టిన కూల్చివేత పర్వంపై స్థానికులు మండిపడుతున్నారు. పేదలని చూడకుండా చిన్నపాటి దుకాణాలను సైతం నేలమట్టం చేయడంపై ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వారికి మరో చోటు కేటాయించాలని కోరుతున్నారు.

ఇందుకేనా మీ పార్టీకి ఓటేసింది పవన్ ?



చిరు వ్యాపారం సాగిస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్న పేదలైన మాపైనా మీ ప్రతాపం. తిరుపతి అంతా ఫుట్‌పాత్‌లు ఆక్రమించారు. పెద్ద పెద్ద బిల్డింగులు కడుతున్నారు. వారిని వదిలేసి ..పేదరికంలో మగ్గుతున్న మ్మమ్మల్ని వేధించడం మంచిది కాదు. మీకు చేతనైతే ఆక్రమణలను కూలగొట్టండి. పవన్ కల్యాణ్ ఇందుకేనా నిన్ను గెలిపించుకుంది ?

- మల్లిక, పండ్ల వ్యాపారి.

దేవుడు మిమ్మల్ని ఊరికే వదలడు..



గడచిన ఆరేళ్లుగా పూజా సామగ్రి అమ్ముకుని బతుకుతున్నాం. నాకు ఇద్దరు ఆడబిడ్డలు. ఇక్కడ వచ్చే ఆదాయంతో కుటుంబ పోషణతో పాటు పిల్లలను చదివించుకుంటున్నా. మాకు ముందస్తు సమాచారం లేకుండా పందిరితో పాటు పూజా సామగ్రిని పూర్తిగా ధ్వంసం చేశారు. కోలుకోలేని దెబ్బ కొట్టి మా కుటుంబాన్ని వీధిన పడేశారు. దేవుడు మిమ్మల్ని ఊరికి వదలడు.

- లక్ష్మీదేవి, వీధి విక్రయదారి

రూ.10వేలు ఇవ్వలేదని కక్ష గట్టి..



ఎనిమిదేళ్లుగా పండ్ల వ్యాపారం చేస్తున్నాను. ఇన్ని రోజులు లేని సమస్య ఇప్పుడే ఎందుకు వచ్చింది ? గత ప్రభుత్వంలో ఇలాంటి ఇబ్బందులు లేవు. ఫారెస్ట్ అధికారులు ప్రతిరోజు ఈ ప్రాంత వ్యాపారుల నుంచి పండ్లు, కూరగాయలు ఉచితంగా తీసుకెళ్తున్నారు. ఇవి కాక ప్రతి షాపు నుంచి ఇటీవల రూ.10 వేలు అడిగారు. ఇవ్వలేదని మాపై కక్ష గట్టి ఫిర్యాదు చేసి తొలగించేలా కుట్ర చేశారు.

- లీలావతి, పండ్ల వ్యాపారి

తగిన మూల్యం చెల్లించుకుంటారు



ఎప్పుడూ లేని విధంగా పేదలపై కక్షగట్టి వ్యవహరిస్తారా? తిరుపతిలో ఎన్నో ఆక్రమణలు జరుగుతున్నాయి. అధికారులకు వాటిని అడ్డుకునే దమ్ము ఉందా ? లక్షలు ఇచ్చుకోలేరు కాబట్టే మాలాంటి పేదలు భయపడుతున్నారు. పేదల పక్షాన నిలబడిన మమ్మల్ని అరెస్టు చేస్తారా ? పాలకులు, అధికారులు తగిన మూల్యం చెల్లించుకుంటారు.

- కె. రాధాకృష్ణ, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి

కార్మికులను దగా చేస్తున్న ప్రభుత్వాలు

తిరుపతి కల్చరల్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మికులను దగా చేసేలా తీసుకొచ్చిన లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని సీపీఎం జిల్లా ఉపాధ్యక్షుడు వందవాసి నాగరాజు డిమాండ్ చేశారు. మంగళవారం సీఐటీయూ ఆధ్వర్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఖరిని ఎండగడుతూ పాత మున్సిపల్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మిక హక్కులకు రక్షణ లేకుండా పోయిందని, కార్మిక వర్గాన్ని అణచి వేయడానికి తమ దోపిడీని తీవ్రతరం చేందుకు కేంద్ర ప్రభుత్వం లేబర్ కోడ్‌లను తీసుకొచ్చిందన్నారు. ప్రస్తుతం కేంద్రం, రాష్ట్రంలో ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలను అవలంభిస్తూ పాలకులు దగా చేస్తున్నారన్నారు. అందుకే లేబర్‌కోడ్‌లను రద్దు చేయాలని కోరుతూ జూలై 9న దేశవ్యాప్తంగా చేపట్టే సమ్మెలో కోట్లాది మంది ప్రజలు పాల్గొని ఈ ప్రభుత్వాలకు గుణపాఠం చెప్పాలన్నారు. సీఐటీయూ నేతలు పాల్గొన్నారు.

రాష్ట్రంలో దగా పాలన

రాష్ట్రంలో మంచి ప్రభుత్వం అంటూ కూటమి ప్రభుత్వం సంబరాలు జరుపుకుటోందని, ఇది మంచి ప్రభుత్వం కాదు.. మందిని ముంచే ప్రభుత్వమని, వాగ్దానాలను మింగే ప్రభుత్వం, మహిళలు, కార్మిక వర్గానికి ద్రోహం చేసే ప్రభుత్వమని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చంద్రశేఖర్‌రెడ్డి, కె.రాధాకృష్ణ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. దేశవ్యాప్తంగా కేంద్ర కార్మిక సంఘాల ఫెడరేషన్ పిలుపు మేరకు ఏఐటీయూసీ ఆధ్వర్యంలో మంగళవారం ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలో యుద్ధ వాతావరణం నేపథ్యంలో ఈ నెల 15న ఢిల్లీలో సమావేశమైన కేంద్ర కార్మిక సంఘాలు జూలై 9వ తేదీకి దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను వాయిదా వేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నేతలు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న సీఐటీయూ నేతలు

జూలై 9న దేశవ్యాప్త సమ్మె

తిరుపతి రూరల్ : లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని, కనీస వేతన చట్టాన్ని అమలు చేయాలని కోరుతూ దేశవ్యాప్తంగా జూలై 9వ తేదీ జరిగే సమ్మెను విజయవంతం చేయాలని కార్మిక సంఘాల నేతలు కోరారు. తిరుపతి రూరల్ మండలం పేరూరు వద్ద వున్న హార్టికల్చర్ వర్సిటీ ఆధ్వర్యంలో నడిచే చీని, నిమ్మ పరిశోధన స్థానంలో పనిచేసే కార్మికులతో కలసి మంగళవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు.

అందాల కోన



తలకోన అటవీ ప్రాంతంలో కురిసిన భారీ వర్షాలకు తలకోన జలపాతం పరవళ్లు తొక్కుతోంది. గత మూడు రోజులుగా తలకోన అడవుల్లో వర్షాలు పడుతున్నాయి. దీంతో జలపాతం వద్ద వర్షపు నీరు భారీగా వస్తుండడంతో జలపాతం కనువిందు చేస్తోంది. ప్రమాదకర స్థాయిలో జలపాతం వద్ద నీళ్లు జాలువారుతున్నాయి.

- భాకరాపేట

మునీశ్వరుడి దర్శనం.. బహుకష్టం



మునీశ్వరుడి ఆలయం ముందు కాలువలో నిలిచిన మురుగు



పరాశురేశ్వరుని ఆలయ పరిసరాల్లో చెత్తా చెదారం

తిరుపతి రూరల్ : తిరుపతి రూరల్ మండలం తిరుచానూరు పంచాయతీ యోగిమల్లవరం పంచాయతీలో పురాతన శివాలయం శ్రీపరాశురేశ్వరస్వామి ఆలయం. ఈ ఆలయానికి అనుబంధంగా ఉన్న మునీశ్వరుని ఆలయానికి భక్తులు వెళ్లాలంటే ముక్కు మూసుకోవాల్సిందే.. ఎందుకంటే పరాశురేశ్వరుని ఆలయంతో పాటు పరిసరాలు అన్నీ దుర్గంధభరితంగా మారాయి. ముఖ్యంగా మునీశ్వరుని ఆలయం ముందున్న మురుగు కాలువను నెలల తరబడి శుభ్రం చేయకపోవడం వల్లే ఈ పరిస్థితి అని భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే ఆలయంలోకి వెళ్లే అర్చకులు సైతం మురుగునీటిని తొక్కుకుంటూ వెళ్లాల్సి వస్తోంది. చాలామంది భక్తులు ప్రధాన ఆలయాన్ని దర్శించి మునీశ్వరున్ని దర్శించుకోకుండానే వెనుదిరుగుతున్న పరిస్థితి.

రాత్రిళ్లు దోమల దండయాత్ర

యోగిమల్లవరం, ప్రశాంత్‌నగర్ వాసులపై రాత్రి వేళ దోమలు దండయాత్ర చేస్తున్నాయి. మురుగు కాలువలు శుభ్రపరచకపోవడం, గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మురుగు నీరు తోడవడంతో దోమలు దాడి చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తిరుచానూరు గ్రామ పంచాయతీ అధికారులకు ఫిర్యాదులు చేసినా పారిశుద్ధ్య సిబ్బంది అమ్మవారి ఆలయం చుట్టూ పనులు చేసుకుంటున్నారే తప్పా ఇటువైపు రావడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా మురుగు కాలువలు శభ్రం చేయాలని కోరుతున్నారు.

దయనీయంగా ఉంది.. దయ చూపరా..!



దామినేడు ఇందిరమ్మ కాలనీలో మురుగు నీటి మడుగు



అడుగేసేందుకు సైతం వీలులేని దుస్థితి

చంద్రగిరి: కూటమి పాలనలో పారిశుద్ధ్యం పడకేసిందనడానికి ఈ ఫొటోలో సాక్ష్యాలు. గత మూడు రోజులుగా వర్షాలు కురుస్తున్నాయి. దీంతో తిరుచానూరు పంచాయతీ పరిధిలోని దామినేడు, ఇందిరమ్మ గృహాల్లో పారిశుద్ధ్యం అధ్వానంగా తయారైంది. నాలుగు చినుకులు పడగానే కాలనీలో మురుగునీరు రోడ్డుపైకి చేరుతోంది. మంగళవారం కాలనీ అంతా బురదమయంగా మారడంతో అడుగు తీసి అడుగు వేయడమే కష్టంగా మారింది. కూటమి పాలన వచ్చాక అధికారులు, నాయకులు ఫొటోలకు ఫోజులు ఇచ్చి వెళ్తున్నారే తప్ప సమస్య పరిష్కరించడంలో మాత్రం అలసత్వం ప్రదర్శిస్తున్నారంటూ కాలనీవాసులు మండిపడుతున్నారు. దామినేడు బ్లాక్ నంబరు 54 వద్ద పరిస్థితి మరింత దారుణంగా ఉంది. కలెక్టరేట్‌కు కూతవేటు దూరంలో ఉండే ప్రజలు ఇంత ఇబ్బందులు పడుతున్నా, అధికారులు మాత్రం అటువైపు కన్నెత్తి చూడడం లేదంటున్నారు. సమస్యను పంచాయతీ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదని.. జిల్లా అధికారులు స్పందించి మెరుగైన పారిశుద్ధ్యం కల్పించాలని వారు కోరుతున్నారు.

నోటీస్ బోర్డు

- తిరుపతి పరిధిలోని నార్త్ సెక్షన్‌లోని 33/11కేవీ రాముల వారి టెంపుల్ ఫీడర్‌లో విద్యుత్ మరమ్మతుల కారణంగా ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు కేబీ లేఅవుట్, సింగాలగుంట ప్రాంతాల్లో విద్యుత్‌కు అంతరాయం
- భవానీనగర్‌లోని రోటరీ క్లబ్ కార్యాలయంలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, తిరిగి సాయంత్రం 4 నుంచి రాత్రి 8 గంటల వరకు మెగా ఆక్యుప్రెజర్ వైద్యశిబిరం
- దళిత విద్యార్థి జేమ్స్‌పై జరిగిన దాడిని ఖండిస్తూ కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం ఆధ్వర్యంలో ఉదయం 10 గంటలకు యశోదనగర్‌లోని వేమన విజ్ఞాన కేంద్రంలో రౌండ్ టేబుల్ సమావేశం
- చిరు వ్యాపారులపై దౌర్జన్యానికి పాల్పడిన టౌన్ ప్లానింగ్ అధికారులను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేస్తూ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఉదయం 11 గంటలకు తిరుపతి నగర పాలక సంస్థ కార్యాలయం ముట్టడి
- ప్రపంచ రక్తపోటు దినోత్సవం సందర్భంగా మంగళం రోడ్డులోని ఆర్టీఓ కార్యాలయం ఎదురుగా ఉన్న సహస్ర హాస్పిటల్లో ఉదయం 9 నుంచి రాత్రి 7 గంటల వరకు రక్తపోటు ఉచిత వైద్యశిబిరం
- తుడా కార్యాలయం వద్ద సాయంత్రం 5 గంటలకు తుడా చైర్మన్‌గా డాలర్స్ దివాకర్ రెడ్డి ప్రమాణస్వీకార మహోత్సవం.

టిప్పర్ సీజ్

రేణిగుంట: మండలంలోని కరకంబాడి సమీపంలో మట్టి అక్రమ రవాణా చేసేందుకు సిద్ధంగా ఉన్న టిప్పర్‌ను మైనింగ్ అధికారులు సీజ్ చేసి రేణిగుంట అర్బన్ పోలీసులకు అప్పగించారు. కరకంబాడి పంచాయతీలో కొంతకాలంగా మట్టి అక్రమ రవాణా చేస్తున్నారనే ఫిర్యాదులు అందడంతో మైనింగ్ అధికారులు మంగళవారం దాడులు చేశారు. మట్టిని అక్రమంగా రవాణా చేసేందుకు సిద్ధంగా ఉన్న టిప్పర్‌ను స్వాధీనం చేసుకున్నారు. మైనింగ్ అధికారులు సీజింగ్ లెటర్ ఇచ్చిన తర్వాత తదుపరి చర్యలు తీసుకుంటామని ఎస్సై అరుణ్ కుమార్ రెడ్డి తెలిపారు.



పోలీస్ స్టేషన్ ఎదుట టిప్పర్

ఉద్యోగ భద్రత కల్పించండి


నిరసన వ్యక్తం చేస్తున్న తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ ఉద్యోగులు

తిరుపతి అర్బన్: తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ డ్రైవర్లుగా పని చేస్తున్న తమకు ఉద్యోగ భద్రతతో పాటు కనీస వేతనం కల్పించాలని డిమాండ్ చేశారు. మంగళవారం కలెక్టరేట్ వద్ద తిరుపతి, శ్రీకాళహస్తి ప్రసూతి ఆస్పత్రుల్లో పని చేసే ఉద్యోగులు నిరసన వ్యక్తం చేశారు. తాము తొమ్మిదేళ్లుగా పని చేస్తున్నా.. కేవలం రూ.7850 మాత్రమే వేతనం ఇస్తున్నారని వాపోయారు. కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. వారికి సీఐటీయూ నేతలు మద్దతు తెలిపారు. అనంతరం కలెక్టర్ వెంకటేశ్వర్‌కు వినతిపత్రాన్ని ఇచ్చారు.





గంగమ్మా..కాపాడరావమ్మా


నారికేళ అలంకరణలో దర్శనమిస్తున్న గంగమ్మతల్లి


గంగమ్మకు సారె తీసుకొస్తున్న రెడ్డి సామాజిక వర్గం

- అట్టహాసంగా మరుపొంగళ్లు
- తాతయ్యగుంట ఆలయానికి పోటెత్తిన భక్తులు
- నారికేళాల అలంకరణలో గంగమ్మ

తిరుపతి కల్చరల్: మమ్ములను కాపాడరావమ్మా.. గంగమ్మ తల్లీ అంటూ భక్తజనం శ్రీతాతయ్యగుంట గంగమ్మను వేడుకున్నారు. తిరుపతి గంగజాతర తర్వాత వచ్చే ఐదు మంగళవారాలు గంగమ్మకు భక్తులు మరుపొంగళ్లు సమర్పిస్తారు. అందులో భాగంగా మొదటి మంగళవారం భక్తులు పొంగళ్లు పెట్టి గంగమ్మకు మొక్కులు చెల్లించి ప్రణమిల్లారు. ఆలయంలో అమ్మవారి మూలవిరాట్‌కు అభిషేకం చేశారు. అనంతరం నారికేళాలతో అమ్మవారిని సర్వాంగ సుందరంగా ప్రత్యేక అలంకరణలో కొలువుదీర్చి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. మొన్న జాతరలో వేషాల మొక్కులు చెల్లించని భక్తులు ఈ వారం పలు వేషాల్లో వచ్చి ఆలయ ప్రదక్షిణ చేసి అమ్మవారి పాదాల వద్ద ప్రణమిల్లి మొక్కులు చెల్లించారు. ఆలయ ఈఓ కె.మమత అమ్మవారి దర్శన ఏర్పాట్లను పర్యవేక్షించారు.

గంగమ్మకు మొక్కులు..

మరుపొంగళ్ల సందర్భంగా రాయలసీమ రంగస్థలి కళాకారులు వివిధ వేషాలు ధరించి అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో రంగస్థలి చైర్మన్ గుండాల గోపినాథ్‌రెడ్డి, సంఘ సభ్యులు పాల్గొన్నారు. అలాగే రెడ్డి సామాజిక వర్గానికి చెందిన వారు జాతర అనంతరం తొలి మంగళవారం గంగమ్మకు భక్తి ప్రపత్తులతో సారె సమర్పించారు. హరిణి టవర్స్ నుంచి సారెను ఊరేగింపుగా తీసుకొచ్చి ఆలయంలో అమ్మవారికి సారెను సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో మునీశ్వర్‌రెడ్డి, లీలాకృష్ణారెడ్డి, మోహన్‌రామిరెడ్డి, రెడ్డెప్పరెడ్డి, దామోదర్‌రెడ్డి, సిద్ధారెడ్డి, శ్రీమన్నారాయణరెడ్డి, రాజారెడ్డి, దాసుమునిరెడ్డి, సుమతి పాల్గొన్నారు.


వేయికళ్ల దుత్తలతో మొక్కులు తీర్చుకుంటున్న భక్తులు


వేషాలతో మొక్కులు చెల్లించుకున్న రంగస్థలి కళాకారులు

సాహితీకారుల మరణం తీరనిలోటు


నివాళులు అర్పిస్తున్న సాహితీవేత్తలు, రచయితలు, కవులు

తిరుపతి కల్చరల్: ఇటీవల మృతి చెందిన శ్రీపద్మావతి మహిళా డిగ్రీ కళాశాల తెలుగు శాఖ పూర్వ అధ్యాపకురాలు డాక్టర్ ప్రేమావతి, ప్రముఖ రచయిత గొల్లాపిన్ని సుబ్రమణ్యం శర్మ వంటి సాహితీకారుల మరణం తెలుగు సాహితీ ప్రపంచానికి తీరని లోటు అని పలువురు వక్తలు తెలిపారు. జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో మంగళవారం చాంబర్ ఆఫ్ కామర్స్ కార్యాలయంలో సాహితీకారులైన ప్రేమావతి, గొల్లాపిన్ని సుబ్రమణ్యం సంస్మరణ సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా రచయితల సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సాకం నాగరాజు, డాక్టర్ మన్నవ గంగాధరప్రసాద్, ప్రముఖ సాహితీవేత్తలు మధురాంతకం నరేంద్ర, రాసాని, జిల్లా అరసం అధ్యక్ష, కార్యదర్శులు యువశ్రీ మురళి, నెమిలేటి కిట్టన్న, తోట వెంకటేశ్వర్లు హాజరై మాట్లాడారు. పూర్వ అధ్యాపకురాలు ప్రేమావతి, ప్రముఖ రచయిత గొల్లాపిన్ని సుబ్రమణ్యం సాహితీ రంగానికి చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో కథా రచయితలు ఆర్‌సీకే రాజు, పేరూరు బాలసుబ్రమణ్యం, గంగవరం శ్రీదేవి, బి.రవి, కృష్ణవేని, మల్లేశ్వరరావు, గొడుగుచింత గోవిందయ్య, దామోదరం, ధర్మయ్య, జిల్లేళ్ల బాలాజి, గజేంద్ర దామోదర గుప్తా, రాజగోపాల చంద్రశేఖర్, విశ్వనాథరెడ్డి, సత్యాల బాదుల్లా పాల్గొన్నారు.

గంగమ్మలకు కల్యాణ వెంకన్న సారె


వెంకటపతినగర్‌లో జరుగుతున్న గంగమ్మ జాతరకు సారె సమర్పిస్తున్న చెవిరెడ్డి లక్ష్మి


దుర్గసముద్రంలో గంగమ్మకు హారతిస్తున్న చెవిరెడ్డి లక్ష్మి

తిరుపతి రూరల్ : తిరుపతి రూరల్ మండలంలోని వెంకటపతినగర్, దుర్గసముద్రం, ముండ్లపూడి గ్రామాల్లో జరుగుతున్న గంగమ్మ జాతర్లకు తుమ్మలగుంట శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయం నుంచి మంగళవారం రాత్రి సారె సమర్పణ చేశారు. ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు, చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి సతీమణి చెవిరెడ్డి లక్ష్మీ సారెను తీసుకువెళ్లి గ్రామాల పెద్దలకు అందజేశారు. గ్రామస్తులు, జాతర కమిటీ పెద్దలు చెవిరెడ్డి లక్ష్మీకి సాదర స్వాగతం పలికారు. గంగమ్మ జాతర సందర్భంగా ఏర్పాటు చేసిన నడివీధి గంగమ్మలను ఆమె దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఆయా పంచాయతీల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వైఎస్సార్‌సీపీ నేతలు ఆమె వెంట వున్నారు.





